
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 18 । ఆగస్టు । 2024



సోమశిలలో 23.179 టీఎంసీలు

సోమశిల: జలాశయం శనివారానికి 23.179 టీఎంసీలకు చేరుకుంది. జలాశయానికి 9,844 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,750
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,670
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,870
నవర (8 గ్రాములు)	రూ.54,960

గరిష్టం/కనిష్టం
37.0 /28.2

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఆకాశం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉంటాయి. గాలిలో తేమ 72 శాతం ఉంది.

న్యూస్‌రీల్

21 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు

• రెండు పాఠశాలల్లో వాయిదా

నెల్లూరు (టౌన్): జిల్లాలో వాయిదా పడిన 23 ప్రభుత్వ పాఠశాలలకు శనివారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. వీటిల్లో 21 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. నెల్లూరు రూరల్ మండలం గొల్లకందుకూరులోని ఎంపీపీఎస్, వరికుంటపాడు మండలం జంగారెడ్డిపల్లిలోని ఎంపీపీఎస్‌లో కోరం లేని కారణంగా ఎన్నికను వాయిదా వేశారు.

పిడుగుపాటుకు రైతు మృతి



వెంగయ్య మృతదేహం

ఉదయగిరి: పిడుగుపాటుకు గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన వరికుంటపాడు మండలం జి.కొండారెడ్డిపల్లి పంచాయతీ కొత్తపల్లిలో శనివారం సాయంత్రం జరిగింది. గ్రామస్తుల సమాచారం మేరకు.. కుమ్మత వెంగయ్య(47) పొలంలో వరినాట్లు వేయిస్తున్నాడు. ఈ క్రమంలో నారు కట్టలు మోస్తుండగా సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. ఈ సమయంలో నారు కట్టలు మోస్తున్న వెంగయ్యపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలోనే ఉన్న కూలీలు గమనించి నిర్జీవంగా పడి ఉన్న అతన్ని వెంటనే ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య ఇద్దరు బిడ్డలు ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు.

డీసిల్టేషన్ పాయింట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి



అధికారులకు సూచనలిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ప్రజలకు ఇసుక ఇబ్బందులు లేకుండా త్వరగా డీసిల్టేషన్ పాయింట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి నారాయణ ఇరిగేషన్, మైన్స్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో జిల్లా స్థాయి శాండ్ కమిటీ సమావేశం జరిగింది. మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మూడు ఇసుక డిపోల్లో నిల్వలు తగ్గిపోతున్న దృష్ట్యా ప్రజలకు ఇసుక ఇబ్బందులు లేకుండా డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించి అనుమతులకు చర్యలు తీసుకోవాలన్నారు. వీలైనంత తక్కువ ధరకు ప్రజలకు ఇసుక అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఇసుక అక్రమాలు జరగకుండా కఠినంగా వ్యవహరించాలని సూచించారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ ఎక్కు వ పాయింట్లు ఏర్పాటు చేసినట్లయితే ప్రజలకు దగ్గరగా ఉండి రవాణా ఖర్చులు తగ్గుతాయన్నారు. ఇసుక సమస్యలపై 0861–2943569 టోల్ ఫ్రీనంబరుకు తెలియజేయాలన్నారు. ఇసుక అక్రమాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేశామని మైన్స్ డీడీ శ్రీనివాసరావు వివరించారు. ఈ సమావేశంలో ఎస్పీ కృష్ణకాంత్, జేసీ కార్తీక్, ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్, సబ్ కలెక్టర్ విద్యాధరి, ఆర్డీఓలు మలోల, మధులత, ఏఎస్పీ సౌజన్య పలువురు అధికారులు పాల్గొన్నారు.

నారాయణ విద్యాసంస్థలు విద్యార్థుల సూసైడ్ స్పాట్స్‌గా మారాయి. మార్కులు, ర్యాంక్‌ల పేరుతో చేసే ఒత్తిడితో కొందరు, ర్యాగింగ్ భూతానికి మరి కొందరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. టెన్త్ నుంచి మెడికల్ విద్యార్థుల వరకు అర్ధాంతంగా బలైపోతున్నారు. ఫీజుల రాబడే పరమావధిగా భావిస్తున్న యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్, భద్రతపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ విద్యా సంస్థల్లో ఇలాంటి దారుణాలు జరుగుతున్నా.. యాజమాన్యం దృష్టి సారించకపోవడం నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. తమ బిడ్డలను ఉన్నత స్థాయిలో చూడాలని అప్పులు చేసి మరీ ఈ కార్పొరేట్ కళాశాలల్లో చేర్పిస్తే.. తల్లిదండ్రుల ఆశలు, కలలు సమాధి చేస్తున్నాయి.



ఆశలు సమాధి చేస్తూ..
బంధాలను బలి చేస్తూ..

నెల రోజుల్లో ఇద్దరు నారాయణ విద్యార్థుల ఆత్మహత్య

ర్యాగింగ్ భూతం, తీవ్ర ఒత్తిళ్లు..

యాజమాన్యం నిర్లక్ష్యమే అంటున్న తల్లిదండ్రులు

ఇటీవల తోటి విద్యార్థి ర్యాగింగ్‌తో బీడీఎస్ విద్యార్థి ప్రదీప్ బలవన్మరణం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నారాయణ విద్యా సంస్థల్లో చదువుకునే ఇద్దరు విద్యార్థులు నెల రోజుల వ్యవధిలోనే ఆత్మహత్యలు చేసుకున్నారు. ఒకరు మెడికల్ కళాశాలలో తోటి విద్యార్థి హింస తాళలేక అదే కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడితే.. సరిగ్గా నెల క్రితం క్లాస్ టీచర్ కొట్టడంతో మానసికంగా కుంగిపోయి ఇంట్లో ఉరేసుకుని మరొకరు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఇద్దరే కాకుండా గత కొన్నేళ్లుగా ఎందరో విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. అప్పట్లో కార్పొరేట్ ముసుగులో కేసులు కాకుండా వ్యవస్థలను తొక్కేసి.. బాధితుల నోర్లు నొక్కేస్తే.. ఇప్పుడు నారాయణ టీడీపీ ప్రభుత్వంలో మంత్రి అయ్యాక ఇలాంటి దారుణాలు వెలుగు చూడకుండానే మరుగునపడుతున్నాయి. బిడ్డలను చదివించి ఉన్నతంగా చూడాలనుకునే తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చిపోతున్నారు. తమ విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలు చేసుకుంటున్నా యాజమాన్యం మాత్రం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోంది. మరోసారి ఇలాంటివి జరగకుండా చర్యలు చేపట్టాల్సిన కార్పొరేట్ యాజమాన్యం సంపాదనే ధ్యేయంగా.. అవేమి తమకు పట్టవన్నట్లుగా తల్లిదండ్రుల ఆశలు, కలలు సమాధి చేస్తోంది. సదరు యాజమాన్యం ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉండడంతో పోలీసులు కూడా విచారణ జరిపే సాహసం చేయలేకపోతున్నారు. ఇటీవల నారాయణ ఆస్పత్రి ప్రాంగణంలో హత్య జరిగినా కూడా రహస్యంగా ఉంచేశారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

నెల క్రితమే క్లాస్ టీచర్ వేధింపులతో..

నెల్లూరులోని రమేష్‌రెడ్డి నగర్‌లోని నారాయణ ఒలంపియాడ్‌లో పదో తరగతి చదువుతున్న జయధర్ (15) స్కూల్ టీచర్ వేధింపులకు తాళలేక తన ఇంటి వద్దే ఆత్మహత్య చేసుకుని తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చాడు. క్లాస్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధించే జయధర్ చదువుల్లో చురుగ్గా ఉండడమే శాపంగా మారింది. క్లాస్ టీచర్లు జయధర్‌ను ప్రతి రోజు ఏదో ఒక సాకుతో సూటిపోటి మాటలతో వేధించేవారు. గత నెల 16న జయధర్‌ను అందరి ముందు క్లాస్ టీచర్ కొట్టడంతో అవమాన భారంతో 17వ తేదీ జయధర్ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తమ కుమారుడు మృతికి నారాయణ యాజమాన్యం ప్రిన్సిపల్ కీర్తి, కెమిస్ట్రీ టీచర్ జయచంద్ర, మ్యాథ్స్ టీచర్ హరిబాబు, సోషల్ టీచర్ శ్రీనివాసులే కారణమని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కన్న కొడుకు మృతితో కుమిలిపోతున్న ఆ తల్లిదండ్రులకు యాజమాన్యం కనీసం ఓదార్పు ఇవ్వకపోగా పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసును మమ అనిపించేలా చేశారు. నారాయణ రాష్ట్ర మంత్రిగా ఉండడంతో తమకు తీరని అన్యాయం చేశారంటూ ఆ తల్లిదండ్రులు విలపిస్తున్నారు. అనుమానాస్పద మృతి సెక్షన్‌తో కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తమకు న్యాయం చేయాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

ర్యాగింగ్‌కు బలైపోయిన ప్రదీప్

నారాయణలో బీడీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రదీప్‌కుమార్ తోటి విద్యార్థి ర్యాగింగ్‌కు బలైపోయాడు. సహచర విద్యార్థి వేధింపులు, దాడులపై యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా సరైన చర్యలు తీసుకోకపోవడంతో తాను చదివే కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బిడ్డ చనిపోయిన విషయం కనీసం తల్లిదండ్రులకు తెలియజేయకుండా వ్యవహరించిందంటే యాజమాన్యం అమానవీయతకు అద్దం పడుతోంది. అనంతపురం జిల్లా తాడిపత్రిలోని జీవీపీ కాలనీకి చెందిన కె. నారాయణ, లీలావతి దంపతులకు అఖిల్‌కుమార్, ప్రదీప్‌కుమార్ ఇద్దరు పిల్లలు. పెద్ద కుమారుడు అఖిల్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాగా, రెండో కుమారుడు నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలలో బీడీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. కళాశాల బాయ్స్ హాస్టల్ (సుస్రీత) లో రెండో అంతస్తులోని 209 రూమ్‌లో ఉంటున్నాడు. అత్యంత సున్నిత మనస్తత్వం కలిగిన ప్రదీప్‌కుమార్ చదువే తన లోకంగా ఉండేవాడు. అదే కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కేపీ సాయి రాహుల్‌కుమార్ అదే హాస్టల్‌లో 205 రూమ్‌లో ఉంటున్నాడు. ప్రదీప్‌కుమార్ కళాశాలలో చేరిన ఆరు నెలల నుంచే సాయి రాహుల్‌కుమార్ ర్యాగింగ్ చేస్తూ మానసికంగా, శారీరకంగా వేధించసాగాడు. ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు దృష్టికి తీసుకెళ్లాడు. వారి సూచన మేరకు కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాడు. అయినా అతని ర్యాగింగ్ ఆపకపోవడంతో తన అన్న అఖిల్‌తో పాటు నెల్లూరు రామ్మూర్తినగర్‌లో ఉంటున్న పెద్ద నాన్న కుమారుడు కిరణ్‌కుమార్‌కు చెప్పాడు. కిరణ్‌కుమార్ ఈ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి నిలదీయడంతో రాహుల్‌కుమార్‌ను పిలిచి మందలించారు. మరోమారు ర్యాగింగ్, వేధింపులకు గురి చేయనని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చాడు. అయినా అతని తీరులో మార్పు రాకపోగా మరింత మానసిక, శారీరక వేధింపులతో పాటు లైంగిక వేధింపులకు గురి చేయసాగాడు. తట్టుకోలేని ప్రదీప్ జరిగిన విషయాన్ని తన అన్నకు చెప్పాడు. ఆయన రాహుల్‌కుమార్‌ను ఫోన్‌లో తీవ్ర స్థాయిలో మందలించాడు. మరోమారు ఇలాంటి చర్యలకు పాల్పడనని, యాజమాన్యానికి ఫిర్యాదు చేయొద్దని ప్రాధేయపడడంతో క్షమించారు. ఆగస్టు 15 సెలవు కావడంతో ఇంటికి వస్తానని, 14వ తేదీన టికెట్ బుక్ చేయాలని తన అన్నకు ఫోన్ చేశాడు. దీంతో టికెట్ బుక్ చేసి తమ్ముడికి పంపాడు. ఇంతలోనే మళ్లీ రాహుల్ వేధింపులు మరింతగా పెరగడంతో 'నన్ను క్షమించండి.. నా చావుకు కారణమైన రాహుల్‌కు మార్‌కు చట్టరీత్యా శిక్ష పడాలన్నదే తన చివర కోరిక' అని ఈ నెల 12వ తేదీ తెల్లవారు జామున ప్రదీప్‌కుమార్ తన అన్న ఫోన్‌కు మెసేజ్ పెట్టాడు. అనంతరం హాస్టల్ పైఅంతస్తు నుంచి కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నాడు. ప్రదీప్ తన గదిలోని గోడపై నాది సూసైడ్ కాదు మర్డర్, మర్డర్ రాహుల్ అని రాసి ఉండటాన్ని గుర్తించారు.

విద్యార్థి మృతిపై గోప్యత.. బేరాలు

తమ కళాశాల బీడీఎస్ విద్యార్థి తోటి విద్యార్థి ర్యాగింగ్‌తో భవనంపై నుంచి దూకి ఆత్మహత్య పాల్పడితే.. కనీసం అతని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదు. బంధువుల ద్వారా తెలుసుకుని వచ్చారు. కళాశాల ఫీజు ఒక్క రోజు ఆలస్యం అయితే పలుసార్లు ఫోన్లు చేసి ఫీజు కట్టేంత వరకు వేధించే సిబ్బంది, తన కుమారుడు మృతి చెందితే కనీసం ఫోను చేసి సమాచారం అందించకపోవడం దారుణమని మృతుడి తల్లిదండ్రులు, సోదరులు మండిపడ్డారంటే యాజమాన్య వైఖరికి అద్దం పడుతోంది. ఇది ఇలా ఉంటే నారాయణ కళాశాలకు చెందిన కొందరు సిబ్బంది మార్చురీ వద్దకు చేరుకుని బాధితులను మభ్య పెట్టే ప్రయత్నం చేశారు.



బీడీఎస్ విద్యార్థి ప్రదీప్ (ఫైల్)

హత్య జరిగినా రహస్యమేనా..

నారాయణ ఆస్పత్రి ప్రాంగణంలో జూన్ ఆఖరి వారంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రవిగౌర్ (27) హత్యకు గురయ్యాడు. ఆ ప్రాంగణంలో నూతన భవనాలకు పెయింట్ వేసేందుకు వచ్చిన రవిగౌర్‌ను తోటి కార్మికుడు లాల్‌మోహన్‌ను హత్య చేశాడు. హత్య జరిగినా విషయం పోలీసులు రహస్యంగా ఉంచారు. హత్య జరిగిన విషయం 12 రోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది. అప్పట్లో హత్య చేసిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు పంపారు. నారాయణ విద్యా సంస్థల్లో విషాద ఘటనలు జరిగినా రహస్యంగా ఉంచడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది.

చెరువు.. దొరువైంది..

• ఆగని టీడీపీ నేతల అరాచకాలు
• తమ్ముళ్ల కబంధహస్తాల్లో మినగల్లు కుంట
• సాగు, పశువుల తాగునీటి వనరుగా ఉన్న చెరువు
• వైఎస్సార్‌సీపీ హయాలో రూ.10 లక్షలతో అభివృద్ధి
• అధికారం రాగానే అడ్డంగా కబ్జా
• కన్నెత్తి చూడని అధికారులు

సోమశిల: అధికారం అండతో టీడీపీ నేతలు చెరువు కుంటను కబ్జా చేసి చిన్న గుంటగా మార్చేశారు. వ్యవసాయానికి సాగునీటి వనరుగా, పశువులకు తాగునీటి వసతిగా ఉన్న చెరువును కబ్జా చేసి కబంధ హస్తాల్లో పెట్టుకున్నారు. ప్రభుత్వం భూమి కబ్జాకు గురవుతుంటే.. రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదు. టీడీపీ అధికారంలోకి వచ్చిన రెండు నెలలుగా రాష్ట్రం నుంచి పల్లెపల్లె వరకు ఆ పార్టీ నేతలు సాగిస్తున్న అరాచకాలు, దాష్టీకాలు చూస్తున్న ప్రజలు మాట్లాడేందుకు భయపడుతున్నారు. అధికారం మారడంతోనే మట్టి, ఇసుక, గ్రావెల్‌ను కొల్లగొట్టుతున్న టీడీపీ నేతలు.. తాజాగా చెరువు కుంటను కూడా కబ్జా చేశారు. అనంతసాగరం మండలం మినగల్లు గ్రామ సర్వే నంబరు 373లో 12 ఎకరాల చెరువు (కుంట) ఉండేది. దాదాపు 50 ఎకరాల సాగునీరందించే ఈ చెరువు (కుంట) అలుగు పారే స్థాయిలో వర్షాధారంగా నీరు చేరుతుండేది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో కూడా మూకుమ్మడిగా ఆక్రమించేందుకు ప్రయత్నించినప్పటికి స్థానికులు, అధికారులు అడ్డుకోవడంతో అప్పట్లో నిలిచిపోయింది. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.10 లక్షల గ్రాంట్‌తో కట్టను బలోపేతం చేసింది. కరోనా సమయంలో ఆక్రమణకు గురవుతున్న నేపథ్యంలో గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో పరిశీలించి చెరువు వద్ద 'ఇది ప్రభుత్వ భూమి' అనే బోర్డును సైతం ఏర్పాటు చేశారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానిక టీడీపీ నాయకులు బట్రెట్టి నరసింహారెడ్డి, రాపూరు కృష్ణారెడ్డి, రాపూరు రమణారెడ్డి, రాపూరు పెద రమణారెడ్డి తదితరులు ఈ చెరువులో ఆక్రమణకు తెరలేపారు. ప్రస్తుతం చెరువు మొత్తం పూడ్చి వేయడంతో 12 ఎకరాల కుంట.. 2 ఎకరాలకు చేరింది. కనీసం పశువులకు తాగునీరు కూడా అందే పరిస్థితి లేదని గ్రామస్తులు వాపోతున్నారు. మండల రెవెన్యూ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని కుంటను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మినగల్లులోని ఆక్రమణలకు గురై మిగిలిన చెరువు కుంట

స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉప రాష్ట్రపతి పర్యటన



సాంస్కృతిక ప్రదర్శన చేసిన విద్యార్థినులతో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, గవర్నర్ అబ్దుల్‌నజీర్ దంపతులు, మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, మంత్రులు ఆనం, నారాయణ తదితరులు



గవర్నర్ దంపతులకు వీడ్కోలు పలుకుతున్న మంత్రి, కలెక్టర్, ఇతర అధికారులు

వెంకటాచలం: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ శనివారం మండలంలోని సరస్వతీనగర్‌లోని అక్షర విద్యాలయాన్ని సందర్శించారు. స్వర్ణభారత్ ట్రస్ట్ 23వ వార్షికోత్సవ వేడుకలకు హాజరయ్యేందుకు వెంకటాచలం వచ్చిన ఉప రాష్ట్రపతి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ దంపతులు, మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుతో కలిసి తొలుత అక్షర విద్యాలయాన్ని సందర్శించారు. ప్రాంగణంలోని స్వామి వివేకానంద, సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారిని అభినందించారు. అక్షర విద్యాలయ ఆవరణలో సోమా నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని సందర్శించి , అక్కడ శిక్షణ పొందుతున్న వారితో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా పర్యటనకు వచ్చిన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ దంపతులకు నెల్లూరు పోలీస్ కవాతు మైదానంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు ఘనస్వాగతం పలికారు. శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో నెల్లూరుకు చేరుకున్నారు. ఉపరాష్ట్రపతి దంపతులకు స్వాగతం పలికిన వారిలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, కలెక్టర్ ఒ. ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ కార్తీక్, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, ఆర్డీఓ శీనా నాయక్ ఉన్నారు.

గవర్నర్ దంపతులకు ఘనంగా వీడ్కోలు

జిల్లా పర్యటన తర్వాత తిరిగి విజయవాడకు బయలుదేరిన గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులకు నెల్లూరు రైల్వేస్టేషన్‌లో మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ ఘనంగా వీడ్కోలు పలికారు. శుక్రవారం రాత్రి నెల్లూరుకు చేరుకున్న గవర్నర్ తన పర్యటన ముగించుకుని శనివారం రాత్రి రైల్లో విజయవాడ బయలుదేరి వెళ్లారు. గవర్నర్ దంపతులకు వీడ్కోలు పలికిన వారిలో జేసీ కార్తీక్, డీపీఓ సుస్మిత, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, ఆర్డీఓ మలోల తదితరులు ఉన్నారు.

జిల్లాలో 870 మంది మిగులు ఉపాధ్యాయులు

• ప్రభుత్వానికి పంపించిన టీచర్ల అభ్యంతరాలు, ఉపాధ్యాయుల వివరాలు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో 870 మంది సెకండరీ గ్రేడ్ టీచర్స్, స్కూల్ అసిస్టెంట్లు మిగులు ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు లెక్కలు తేల్చారు. ఉపాధ్యాయుల లెక్కతో పాటు వారి అభ్యంతరాలను శుక్రవారం రాత్రి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపారు. తొలుత ఈ నెల 13న వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కోసం కౌన్సెలింగ్ నిర్వహించి ఉపాధ్యాయులకు జాయినింగ్ ఆర్డర్లు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాలు మండల కేంద్రాల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌ను బహిష్కరించారు. ఈ నేపథ్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియను వాయిదా వేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు జిల్లాలో సీనియర్లు, జూనియర్ల వివరాలు, తెలుగు మీడియం స్కూల్స్‌లో అవసరం లేకున్నా ఉర్దూ టీచర్లు ఎవరైనా ఉన్నారా లేదా అనే వివరాలను పంపారు. జిల్లాలో ఉన్న 870 మంది మిగులు టీచర్లలో 360 మందికి పైగా ఎస్జీటీలు ఉన్నారు. మిగిలిన వారు స్కూల్ అసిస్టెంట్లు. ప్రధానంగా జీఓ నంబరు 117ను రద్దు చేసి వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌కు మిగులు టీచర్ల లెక్క తేల్చాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ డిమాండ్‌కు తలొగ్గి పాత జీఓ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారా? లేక 117 జీఓ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారా అనే దానిపై స్పష్టత లేదు.

ముగిసిన శిక్షణ తరగతులు

నెల్లూరు (టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో నోడల్ రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో వారం రోజులుగా అధ్యాపకులకు నిర్వహిస్తున్న కంటెంట్ డెవలప్‌మెంట్ స్టూడియోపై శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. కళాశాల ప్రిన్సిపల్ గిరి మాట్లాడుతూ వారం రోజుల పాటు అధ్యాపకులకు వీడియో మేకింగ్, ఆడియో, ఎడిటింగ్, వీడియో బ్రాడ్‌కాస్ట్, పీపీటీ క్రియేషన్స్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారన్నారు. ఈ శిక్షణలో మొత్తం 155 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనర్స్‌గా చక్రపాణి, రంజిని, మౌనిక, యోగంధర్, వైస్ ప్రిన్సిపల్ రమణారావు కన్వీనర్‌గా, జేకేసీ మెంటార్‌గా వేణు వ్యవహరించారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వెంకటాచలం: అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని మండలంలోని చవటపాళెం సమీపంలో స్థానికులు శనివారం గుర్తించారు. పోలీసుల వివరాల మేరకు.. జాతీయ రహదారి నుంచి చవటపాళెం వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గమనించిన స్థానికులు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా, ఎలాంటి వివరాలు లభించలేదు. మరణించిన వ్యక్తికి సుమారు 40 ఏళ్లు.. ఘటన జరిగి మూడు రోజులై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

నీటి గుంతలో బాలుడి మృతదేహం



కావలి: పట్టణంలోని ముసునూరు వద్ద గల నీటి గుంతలో గుర్తుతెలియని బాలుడి మృతదేహాన్ని శనివారం కనుగొన్నారు. ఘటనపై స్థానిక వీఆర్వో ఫిర్యాదు చేశారు. కావలి రూరల్ సీఐ శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో నీటి నిల్వ



రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 5.89 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 100, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నామని వివరించారు.

రేషన్ బియ్యం కోసం రగడ

ఒకరిపై ఒకరు ఫిర్యాదులు
- ఇద్దరి వద్దా దండుకుంటున్న అధికారులు
- వక్కదారి పడుతున్న వైనం

కందుకూరు రూరల్: నియోజకవర్గంలో రేషన్ బియ్యం వ్యాపారం కొత్త పుంతలు తొక్కుతోంది. ఒక్కసారిగా బియ్యం ధరలు పెరిగిపోవడంతో కొత్త వ్యాపారులు పుట్టుకొచ్చారు. నిత్యం గ్రామాల్లోనే తిష్ట వేసి రేషన్ వాహనాలు, లబ్ధిదారుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు కొత్త వ్యాపారుల రాకతో డిమాండ్ పెరగ్గా, అదే స్థాయిలో గొడవలూ జరుగుతున్నాయి.

దాడి చేయడం.. ఆపై దండుకోవడం

నియోజకవర్గంలో రేషన్ దుకాణాలు మాకు కావాలంటే మాకు కావాలంటుండటంతో అధికార పార్టీ నేతల్లో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఈ తరుణంలో రేషన్ షాపులు, వాహనాల వద్ద నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసే విషయంలో వ్యాపారుల మధ్య పోటీ పెరిగింది. దీంతో నియోజకవర్గంలో ఒకరిపై ఒకరు సివిల్ సప్లయ్స్, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసుకుంటున్నారు. ఈ పరిణామం విజిలెన్స్ అధికారులకు లాభసాటిగా మారింది. దీన్ని ఆసరాగా చేసుకొని ఇద్దరి వద్దా అధికారులు అందిన కాడికి దండుకెళ్తున్నారు.

కిలోకు రూ.10 నుంచి రూ.14

నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 177 రేషన్ షాపులున్నాయి. వీటి పరిధిలో దాదాపు 95 వేల కార్డులుండగా, సుమారు 1100 టన్నుల బియ్యాన్ని దుకాణాలకు ప్రతి నెలా సరఫరా చేస్తుంటారు. గత ప్రభుత్వ హయాంలో 55 వాహనాల ద్వారా ఇంటింటికీ బియ్యాన్ని సరఫరా చేశారు. అయితే ప్రస్తుతం లబ్ధిదారులకు బియ్యం చేరడం లేదు. వ్యాపారులు నేరుగా వాహనాల వద్దకొచ్చి కార్డుదారుడితో వేలిముద్ర వేయించి కిలోకు రూ.10 నుంచి రూ.14 వరకు చెల్లించి బియ్యాన్ని గోతాల్లో నింపుకొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త వ్యాపారులు పుట్టుకొచ్చారు. తమ మండలంలో రేషన్ బియ్యాన్ని తామే కొనుగోలు చేయాలంటూ ప్రతి వాహనం వద్ద కెళ్తున్నారు. ఇది మింగుడుపడని పాత వ్యాపారులు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.



లింగసముద్రంలో రేషన్ బియ్యం పంపిణీ

ఇదో ఉదాహరణ..

గుడ్లూరు మండలానికి చెందిన కొందరు పాత వ్యాపారులకు కొత్త వ్యాపారులు అడ్డొచ్చారు. దీంతో పాత వ్యాపారులు విజిలెన్స్ అధికారులకు డబ్బులిచ్చి మరీ ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు వచ్చి రేషన్ షాపును తనిఖీ చేసి, వాహనాన్ని వెంబడించి పట్టుకున్నారు. అయితే విజిలెన్స్ అధికారులు వారి వద్ద అందిన కాడికి పుచ్చుకొని వెళ్లిపోయారు. అధికార పార్టీలోని వ్యాపారుల మధ్య వివాదాలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి. గ్రామాల్లో అధికార పార్టీకి అనుకూలమైన వ్యక్తులు బియ్యాన్ని కొనుగోలు చేయాలే గానీ మిగిలిన వారెవరూ వ్యాపారం చేయకూడదని, అలా చేస్తే అధికారులకు పట్టిస్తామని బెదిరిస్తున్నారు. వ్యాపారుల మధ్య పోటీ పెరగడంతో గతంలో రూ.10 ఉన్న కిలోను ప్రస్తుతం రూ.14 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో కార్డుదారులు సైతం ఎక్కువ ధర ఎవరిస్తే వారికే విక్రయిస్తున్నారు.

పెరిగిన మార్కెట్ ధర

రేషన్ బియ్యం మార్కెట్ ధర బాగా పెరిగింది. గతంలో వ్యాపారుల వద్ద రూ.20 కంటే ఎక్కువకు కొనుగోలు చేసేవారు కారు. ప్రస్తుతం ఇది రూ.26 నుంచి రూ.30 వరకు పెరిగింది. దీంతో వ్యాపారులూ పెరిగిపోయారు. పోటీలు పడి కాటాలు తీసుకొని గ్రామాలకు రాత్రి వేళ వచ్చి కొనుగోలు చేసుకెళ్తున్నారు. పక్క మండలాల నుంచి వచ్చి ఎక్కువ ధర ఇస్తామని తిరుగుతున్నారు. దీంతో లోకల్, నాన్ లోకల్ అనే సమస్య వచ్చి పడింది. ఇదంతా అధికారులకు తెలిసినా, దాడి చేసి దండుకొని చేతులు దులుపుకొంటున్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి



ఉదయగిరి: మండలంలోని గుడినరవలో పిడుగుపాటుకు గేదె శనివారం మృతి చెందింది. గేదెను పొలంలో యజమాని అంబటి పెద్ద బ్రహ్మయ్య మేపుతుండగా ఒక్కసారి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగుపడి అక్కడికక్కడే మృత్యువాత పడింది. దీని విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని యజమాని పేర్కొన్నారు.

నేత్రపర్వం.. నృసింహుడి కల్యాణం

రాపూరు: మండలంలోని పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి కల్యాణాన్ని నేత్రపర్వంగా శనివారం నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిని మేల్కొల్పి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్య కల్యాణ మండపంలో ఉదయం పది గంటలకు కొలువుదీర్చారు. శోభాయమానంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని జరిపారు. ఊంజల్‌సేవను రాత్రి ఏడు గంటలకు నిర్వహించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 120
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 218
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 240
లేయర్ చికెన్	: 170



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.90
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.35



ఉధృతంగా జూడాల సమ్మె

నెల్లూరు(అర్బన్): కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రిలో మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మె శనివారంతో మూడో రోజుకు చేరుకుంది. దర్గామిట్టలోని ప్రభుత్వ ఏసీ ఎస్సార్ మెడికల్ కళాశాల, పెద్దాస్పత్రిలో పనిచేస్తున్న వందలాది మంది జూనియర్ డాక్టర్లు విధులను బహిష్కరించారు. ఆస్పత్రి నుంచి రాజరాజేశ్వరి గుడి, ఏసీ స్టేడియం మీదుగా భారీ ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో ధర్నా చేపట్టారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలంటూ ఆస్పత్రి ఆవరణలోని రోడ్లపై ముగ్గుపిండితో నినాదాలు రాస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జునైద్ అలీ అహ్మద్, జోయల్ మాట్లాడారు. ప్రాణం పోసే డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలో నిరసన చేస్తున్న డాక్టర్లపై దాడులు చేసిన అక్కడి అల్లరి మూకలను అరెస్ట్ చేసి శిక్షించేంత వరకు ఆందోళనలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. డాక్టర్ల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.

రోగుల అగచాట్లు

పెద్దాస్పత్రిలోని ప్రభుత్వ రెగ్యులర్ డాక్టర్లు సైతం జూడాల సమ్మెకు శనివారం మద్దతిచ్చి విధులను బహిష్కరించడంతో రోగులు నానా అగచాట్లు పడ్డారు. పెద్దాస్పత్రికి నిత్యం వెయ్యి నుంచి 1300 వరకు రోగులు వస్తుంటారు. వీరందరూ ఇబ్బందులు పడ్డారు. వీరి ఆందోళనలకు డీవైఎఫ్ఐ, జేవీవీ నేతలు మద్దతు ప్రకటించారు.



ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు

మాయమవుతున్న మత్స్య సంపద

గండిపాళెంలో సొసైటీ ముసుగులో అక్రమ వ్యాపారం
- వేట నిషేధంలో ఉన్నా చేపల వేట
- ఎమ్మెల్యే పేరుతో దందా

ఉదయగిరి: గండిపాళెం జలాశయంలో ఉన్న ఎంతో విలువైన మత్స్య సంపద అక్రమంగా తరలిపోతోంది. మత్స్య సొసైటీ పేరుతో కొందరు అక్రమార్కులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అనుచరులమంటూ రూ.లక్షల విలువజేసే చేపలను దోచుకుంటున్నారు. ఈ వ్యవహారం మత్స్యశాఖ అధికారులకు తెలిసినా, పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చేపల వేటను ప్రస్తుతం అక్రమంగా సాగిస్తున్న వ్యక్తులు టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను జలాశయం వద్ద భారీ ఎత్తున సన్మానించారు. అనంతరం ఈ అక్రమ వేట సాగిస్తుండటంపై దుమారం రేగుతోంది.

మత్స్య సంపద.. అపారం

గండిపాళెం జలాశయంలో ఎంతో విలువైన మత్స్య సంపద ఉంది. ఈ ప్రాజెక్ట్‌లో నీరు ఎక్కువగా డెడ్ స్టోరేజీలోనే ఉంటోంది. దీంతో చేపలు ఎక్కువగానే ఉంటాయి. ఏడాదిలో ఒక్కసారి చేపలు పడితే సుమారు రూ.రెండు కోట్లకుపైగా విలువజేస్తుందని స్థానికులు చెప్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మత్స్యకార సొసైటీలను రద్దు చేశారు. దీంతో మూడేళ్ల నుంచి చేపలు పట్టకపోవడంతో ఎంతో విలువైన సంపద ప్రాజెక్ట్‌లో ఉందని తెలుస్తోంది.



గండిపాళెం జలాశయం

టీడీపీ నేతల సహకారం

గత ప్రభుత్వంలో మత్స్య సొసైటీల రద్దు నేపథ్యంలో సొసైటీలు కోర్టును ఆశ్రయించాయి. దీంతో చేపల వేట ఆగిపోయింది. కొందరు అక్రమార్కులు దొంగచాటుగా వేట సాగించడంతో సంపద కొంత మేర తరిగిపోయింది. ఈ క్రమంలో ప్రస్తుతం టీడీపీ నేతల సహకారంతో స్థానికంగా ఉన్న మత్స్య సొసైటీ ముసుగులో ఓ వ్యాపారి ఈ దందాను సాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టిన చేపలను డీసీఎం వాహనాల ద్వారా పక్క రాష్ట్రాలకు రోజూ తరలిస్తున్నారని సమాచారం. గత నెల్లో సైతం ఈ తంతు కొన్ని రోజుల పాటు సాగింది. టీడీపీ ప్రభుత్వం తిరిగి చేపలు పట్టుకునే అవకాశాన్ని మత్స్య సొసైటీలకే కల్పించింది. దీంతో ఈ జీఓ అమల్లోకి వస్తే నిజమైన సొసైటీ సభ్యులకు లబ్ధి చేకూరే అవకాశం ఉండటంతో అక్రమార్కులు మత్స్య సంపదను హడావుడిగా కాజేసే యత్నం చేస్తున్నారు.



ప్రాజెక్ట్ వద్ద ఐస్ బాక్సులతో వాహనం

చేపలు పడితే చర్యలు

గండిపాళెం జలాశయంలో చేపల వేటను కొందరు అక్రమంగా సాగిస్తున్నారనే సమాచారంతో అక్కడికెళ్లి వారిని అడ్డుకున్నాం. ప్రాజెక్ట్‌లో వేసిన వలలను తీయిస్తాం. ఆదివారం సాయంత్రంలోపు ఖాళీ చేయిస్తాం. నిబంధనల మేరకు లీజు చెల్లించిన సొసైటీలకే చేపలు పట్టుకునే అవకాశాన్ని కల్పిస్తాం. అంతవరకు ఇలా వ్యవహరిస్తే చర్యలు చేపడతాం.

– మస్తాన్, వీఎఫ్ఏ, గండిపాళెం జలాశయం

నాటకీయంగా విద్యా కమిటీ ఎన్నిక

అక్కంపేటలో ఇదీ తీరు..
- కోర్టులో హౌస్ మోషన్ పిటిషన్
- ఎక్కడ ఆగిందో అక్కడి నుంచే ప్రక్రియ
- ఏకగ్రీవంగా అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక
- అధికార పార్టీకి ఎదురుదెబ్బ

మనుబోలు: మండలంలోని అక్కంపేట ఎన్నెస్సార్ జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ ఎన్నిక హైడ్రామా నడుమ ఎట్టకేలకు శనివారం ముగిసింది. వాస్తవానికి అన్ని పాఠశాలలతో పాటే ఈ పాఠశాల ఎస్సెమ్సీ ఎన్నికను ఈ నెల ఎనిమిదిన నిర్వహించారు. సభ్యులందర్నీ తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోరం పూర్తయి అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక జరగాల్సి ఉండగా, చివరి దశలో తనకు ఆరోగ్యం బాగోలేదంటూ హఠాత్తుగా ప్రక్రియను ఇన్‌చార్జి హెచ్ఎం జీవదయామణి వాయిదా వేశారు. పాఠశాల కోరం మొత్తం మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డికి అనుకూలంగా ఉండటం.. అధికార పార్టీ అనుకూల వర్గం గెలిచేందుకు అవకాశం లేకపోవడంతో హెచ్ఎంను అడ్డుపెట్టుకొని ఎన్నికను వాయిదా వేయించారనే విమర్శలొచ్చాయి.

పిటిషన్ దాఖలు

ఎన్నిక వాయిదాపై కోర్టులో హౌస్ మోషన్ పిటిషన్‌ను కిరణ్‌కుమార్‌రెడ్డి దాఖలు చేశారు. మరో రెండు రోజుల్లో దీనిపై తీర్పు రావాల్సి ఉండగా, ఎస్సెమ్సీ ఎన్నికలను మొదటి నుంచి శనివారం నిర్వహిస్తామంటూ అధికారులు నోటీసులను జారీ చేశారు. అయితే ఈ నెల ఎనిమిదినే కోరం మొత్తం ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో, మళ్లీ మొదటి నుంచి ప్రక్రియను ప్రారంభిస్తామని ప్రకటించడంలో అధికార పార్టీ కుట్ర ఉందని భావించిన తల్లిదండ్రులు ఎన్నికను బహిష్కరించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో దిగొచ్చిన స్థానిక అధికారులు ఎట్టకేలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికను జరిపించడంతో కథ ముగిసింది. 24 మంది ఉన్న కోరంలో 13 మందే హాజరవడంతో ఎన్నికల ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. అధ్యక్షురాలిగా పోతుగుంట రమీజా, ఉపాధ్యక్షుడిగా మందాటి శీనయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కో ఆప్షన్ సభ్యులుగా నారపరెడ్డి కిరణ్‌రెడ్డి, అంబటి శ్రీనివాసులు ఎన్నికయ్యారు. హెచ్ఎం శ్రీనివాసులు, సీఎంఓ పెంచలయ్య, ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యా కమిటీతో అధికారులు